అర్హతే ప్రామాణికంగా పథకాల అమలు

- రానున్న రోజుల్లో టీడీపీని మూసివేత పరిస్థితి ఉంది
- ప్రజా సమస్యల పరిష్కారానికే గడపగడపకు మన ప్రభుత్వం
- ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి
- పెదపాడు మండలంలోని ఏపూరులో పర్యటన

పెదపాడు: మన రాష్ట్రంలో కుల, మత, వర్గ, పార్టీ బేధం లేకుండా అర్హులందరికీ పథకాలను అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. పెదపాడు మండలంలోని ఏపూరులో జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీతో కలిసి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి మాట్లాడుతూ గడపగడపకు వెళ్లినప్పుడు చక్కటి చిరునవ్వుతో ప్రజలు ఆహ్వానం పలుకుతున్నారని చెప్పారు. ప్రజలను ధైర్యంగా ఓటు అడగగల సత్తా వైఎస్సార్ సీపీకే ఉందని ఆయన స్పష్టం చేసారు. ఇప్పటి వరకు 130 మంది గ్రామస్తులు తమ సమస్యలు విన్నవించారని వారందరికీ న్యాయం జరిగేలా చూస్తామన్నారు. అందరికీ మేలు చేస్తూ ప్రభుత్వం ముందుకు వెళ్తా ఉంటే ప్రతిపక్ష పార్టీ లేనిపోని విమర్శలు చేస్తోందన్నారు. ఎలాంటి మ్యానిఫెస్టో లేకుండా ప్రతిపక్ష నేతలు


ఏపూరులో వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి, జెడ్పీ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ

బస్సుయాత్రలు, పాదయాత్రలు చేస్తున్నారని అన్నారు. రానున్న రోజుల్లో టీడీపీ మూసివేసే పరిస్థితి ఉందని అన్నారు. ఏపూరులో ప్రజలకు అబద్ధాలు వల్లెవేయడంతో సభలో వాయు దేముడు తథాస్తు అనడంతోనే స్టేజి కూలిపోయిందన్నారు. చింతమనేనికి ఓటమి ఖాయమని వారి పార్టీ సర్వే రిపోర్టు పేర్కొనడంతో పవన్ కల్యాణ్‌కు దెందులూరు టికెట్ ఇవ్వమని చెబుతున్నాడన్నారు. ప్రతి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి అర్హులకు సంక్షేమ పథకాలు అందిస్తామన్నారు. జగనన్న సురక్ష పథకంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అమలుకు కావాల్సిన సర్టిఫికెట్లు అందిస్తామన్నారు. ఈ గ్రామంలో 10 ఎకరాలు కొని ఇళ్ల స్థలాలుగా అందించామని, అవసరమైతే మరో 5 ఎకరాలు కొని ఇళ్ల స్థలాలు అందిస్తామన్నారు. ఈకార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ అప్పన ప్రసాదరదావు, పెదపాడు ఎంపీపీ బత్తుల రత్నకుమారి ఏసురాజు, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు, గ్రామ సచివాలయాల మండల కన్వీనర్ అక్కినేని గోపి, గోగుంట సొసైటీ అధ్యక్షుడు భావరాజు సత్యన్నారాయణ, ఏలూరు మండల పార్టీ అధ్యక్షుడు తేరా ఆనంద్, దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని, ఏపూరు సర్పంచ్ చోడగిరి రామకృష్ణ, ఎంపీటీసీలు నాగమల్లేశ్వరావు, శిరీషా, బెజవాడ సత్యనారాయణ, శేఖర్, నర్సింహరావు, సీనియర్ నాయకులు సంబంగి శ్రావణ్‌కుమార్, ఏఎంసీ డైరక్టరు కంభంపాటి సుబ్రహ్మణ్యేశ్వరావు, కడిమి గోవిందరావు, ఇల్లూరి విజయ్, కొండేలాజరు, కొత్తూరు విమలారావు, ముంగర రమేష్, తినాతి విజయ్, తహసీల్దార్ జీ విజయ్‌కుమార్ రాజు ఎంపీడీఓ నిర్మలజ్యోతి, వ్యవసాయ అధికారి ప్రదీప్‌కుమార్, ఏపీఎం సుమలత పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కొఠారు పరామర్శ

పెదపాడు: మండలంలోని ఏపూరు గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో చికిత్స పొందుతున్న పలువురిని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి పరామర్శించారు. శనివారం రాత్రి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ముగిసిన వెంటనే మాజీ ఎంపీటీసీ బెజవాడ సత్యనారాయణ తల్లి ద్రౌపతిని పరామర్శించి ఆమె ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఇటీవల భార్యను కోల్పోయిన వైఎస్సార్ సీపీ సానుభూతిపరుడు వెంకటేశ్వరావు (బుడ్డ బాబు)ను ఎమ్మెల్యే పరామర్శించారు. ఏఎంసీ చైర్మన్ అప్పన ప్రసాద్, జెడ్పీ చైర్ పర్సన్ ఘంట పద్మశ్రీ, ఎంపీపీ బత్తుల రత్నకుమారి ఏసురాజు, స్థానిక నాయకులు బెజవాడ సత్యనారాయణ, సర్పంచ్ చోడగిరి రామకృష్ణ, బెజవాడ శిరీషా, బి.శేఖర్, బి.నర్సింహరావు, నాగమల్లేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల ఆరోగ్య పరిరక్షణకు వైద్య పరీక్షలు


భీమడోలులో ఎస్సై చావా సురేష్‌కుమార్, సిబ్బందికి వైద్య పరీక్షలు

భీమడోలు: విధి నిర్వహణలో క్షణం తీరిగి లేకుండా విధులు నిర్వహిస్తూ ఒత్తిడికి గురవుతున్న పోలీసుల ఆరోగ్య పరిరక్షణకు తమ వంతు కృషి చేస్తున్నామని భీమడోలు సీఐ వి.వెంకటేశ్వరరావు అన్నారు. భీమడోలులో శనివారం భీమడోలు సర్కిల్ పరిధిలోని భీమడోలు, ద్వారకాతిరుమల మండలా ల్లోని పోలీసులు, వారి కుటుంబ సభ్యులకు సీఐ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఉచిత గుండె వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసారు. ఈ శిబిరాన్ని సీఐ ప్రారంభించారు. ఏలూరు రమేష్ ఆసుపత్రి సౌజన్యంతో ఉచిత బీపీ, సుగర్, జనరల్ వ్యాధులు, గుండె పరీక్షలు అధునాతన ఈసీజీ యంత్రం సాయంతో చేసారు. భీమడోలు, ద్వారకాతిరుమల ఎస్సైలు చావా సురేష్‌కుమార్, సుధీర్‌తో పాటు సిబ్బంది, వారి కుటుంబ సభ్యులకు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. సీఐ వి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జిల్లా ఎస్పీ ఎం.మేరీ ప్రశాంతి ఆదేశాల మేరకు పోలీసులు సిబ్బంది ఆరోగ్య పరిరక్షణ కోసం వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసామన్నారు. డాక్టర్ ఎస్.భరత్ తేజ్, మేనేజర్ ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

చెత్త నుంచి సంపద కేంద్రాలు ఆదాయ వనరులు


భీమదోలులో వర్మీకంపోస్ట్ తయారీని పరిశీలిస్తున్న డీపీవో ఏవీ విజయలక్ష్మి

భీమడోలు: చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు పంచాయతీలకు ఆదాయ వనరులని జిల్లా పంచాయతీ అధికారి ఏవీ విజయలక్ష్మీ అన్నారు. భీమడోలులోని సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ షెడ్డును ఆమె శనివారం ఆకస్మికంగా సందర్శించారు. తడి, పొడి చెత్తలను డంపింగ్ యార్డుకు సక్రమంగా తరలిస్తున్నదీ లేనిది పరిశీలించారు. సంబంధిత క్లాప్ మిత్రలకు తగు సూచనలందించారు. చెత్త నుంచి సంపద కేంద్రాల్లో వర్మీకంపోస్ట్‌ను తయారీ చేసుకుని ఆర్థిక పరిపుష్టిని సాధించాలన్నారు. కంపోస్ట్ తయారు చేసి విక్రయించి ఆదాయాన్ని పెంచుకోవాలన్నారు. ఇటీవల జలవనరుల శాఖ సంయుక్త కార్యదర్శితో పాటు రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు రాష్ట్రస్థాయిలో గుర్తింపు పొందిన భీమడోలు సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ షెడ్డును పరిశీలించామన్నారు. ప్రతి రోజు ఇంటింటికీ వెళ్లి తడి, పొడి చెత్తలను సేకరించి వాహనాల్లో తరలించాలన్నారు. ప్రజల్లో అవగాహన పెంచడం ద్వారా గ్రామాలు స్వచ్ఛ గ్రామాలు లక్ష్యం సాధించవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో చైతన్య యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు పి.మాన్‌సింగ్, మండల ప్రధాన కార్యదర్శి రామకుర్తి నాగేశ్వరరావు, గ్రామ కార్యదర్శి ఎస్.రమేష్; శానిటరీ ఇన్స్‌పెక్టర్ గంగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

కౌలు రైతు కార్డులతో ఆర్థిక పరిపుష్టి

భీమడోలు: సాగుదారులంతా కౌలు రైతు కార్డులను సద్వినియోగం చేసుకుని ఆర్థిక పరిపుష్టిని సాధించాలని భీమడోలు ఏడీఏ డాక్టర్ పి.ఉషా రాజకుమారి అన్నారు. భీమడోలులో నారుమడులను మండల వ్యవసాయాధికారిణి డాక్టర్ ఎస్‌పీవీ ఉషారాణితో కలిసి శనివారం ఆమె భీమడోలులో పరిశీలించారు. వర్షాలు కురుస్తున్నందున రైతులు వ్యవసాయశాఖ సహాయకుల సూచనలను పాటించి సాగు చేపట్టాలని ఆమె కోరారు. మండలంలో సార్వా సీజన్‌లో 13,250 ఎకరాలకు గాను 700 ఎకరాల్లో నారుమడి వేయాల్సి ఉందన్నారు. ఇప్పటి వరకు మండలంలో 434 ఎకరాల్లో వరి నారుమడులు వేసారన్నారు. రైతులందరికీ ప్రభుత్వం అందిస్తున్న కౌలు హక్కుపత్రాన్ని పొందేందుకు వీఆర్వోలను సంప్రదించి కార్డులను పొందాలన్నారు. పంట నమోదు ప్రక్రియ ప్రారంభమయ్యే నాటికి వారంతా సాగు హక్కు పత్రాలను పొందాలన్నారు. వరి నారుమడి ఐదు సెంట్లలో వేసే నారుమడికి రెండు కిలోల నత్రజని, ఒక కిలో భాస్వరం, ఒక కిలో పొటాష్ ఎరువులను వేసుకోవాలన్నారు. వ్యవసాయాధికారులు, సహాయకుల సూచనలను పాటించడం ద్వారా రైతులు తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు పొందుతారన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

వృద్ధులు ఆహార నియమాలు పాటించాలి

భీమడోలు: వృద్ధులు భుజించే ఆహార పదార్థాల్లో చింత పండు, ప్రాసెసింగ్ చేసిన సాల్ట్‌ను త్యజించి ప్రత్యామ్నాయ పదార్థాలను తీసుకోవాలని ఏలూరు శ్రీకృష్ణా హస్పిటల్ ఆర్థోపెటిక్ డాక్టర్ బి. కృష్ణా అన్నారు. మండలంలోని సూరప్పగూడెంలో శనివారం చర్చ్ ఆఫ్ క్రీస్తు చర్చి ఆవరణలో ఏలూరు స్మార్ట్ సిటీ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏలూరు శ్రీకృష్ణా ఆసుపత్రి సౌజన్యంతో మాజీ ఎంపీపీ ఇంజేటి విజయ్ అచ్యుతం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని భీమడోలు ఏఎంసీ చైర్మన్ ఇంజేటి నీలిమజూనియర్ ప్రారంభించారు. ఈ శిబిరంలో 100 మంది రోగులకు ఎముకలు, కీళ్ల నొప్పులు, వెన్నుముక, మోకాళ్లు, బీపీ, సుగర్స్ పరీక్షలు చేశారు. సాధారణ రోగులకు ఉచితంగా ఎక్స్‌రే తీశారు. ఈ సందర్భంగా ఏఎంసీ చైర్మన్ ఇంజేటి నీలిమజూనియర్ మాట్లాడుతూ లయన్స్ క్లబ్ సేవలు మరవలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ విజయ్ అచ్యుతం, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు అబ్రహం లింకన్, భీమడోలు డైమండ్స్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు తుమ్మల ఉమామహేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి ముత్తయ్య, వైద్యులు బి.కృష్ణా, అభిలాస్, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి

గణపవరం: మహిళలు ఆర్థికంగా బలోపేతం అయితే ఆ కుటుంబం అభివృద్ధి పథంలో నడుస్తుందని సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాశ్‌బాబు అన్నారు. శనివారం గణపవరం మండలం కాశిపాడులో బైర్రాజు ఫౌండేషన్ ఆధ్వర్యంలో మూడు నెలలుగా వివిధ ఉపాధి కార్యక్రమాల్లో శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రకాశ్‌బాబు మాట్లాడుతూ ఒక కుటుంబం ఆర్థిక ప్రగతిలో మహిళల పాత్ర ఉంటుందన్నారు. సర్పంచ్ కోట నాగేశ్వరరావు, బైర్రాజు ఫౌండేషన్ గ్రామ వికాస కమిటీ చైర్మన్ జంపన సూర్యనారాయణరాజు, జిల్లా పీఎంపీ అసోసియేషన్ అధ్యక్షుడు ఏఆర్‌కే పరమేశ్వర్లు, ఆరోగ్య సహాయకుడు నామాలరాజు, బైర్రాజు ఫౌండేషన్ కోఆర్డినేటర్లు రామకృష్ణ, తంగెళ్ల పద్మారావు, పంచాయతీ సెక్రటరీ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష ద్వారా విస్తృత సేవలు


ముప్పర్తిపాడులో జగనన్న సురక్ష ప్రయోజనం వివరిస్తున్న ప్రత్యేకాధికారి శ్రీనివాస్


సోమవరప్పాడులో జగనన్న సురక్ష పథకంపై సర్వే నిర్వహిస్తున్న అధికారులు


జగనన్న సురక్ష కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న సర్పంచి పుత్సకాయల విష్ణుమూర్తి

గణపవరం: ప్రభుత్వ సంక్షేమ ఫలాలు, ప్రభుత్వ సేవలు ప్రజలకు మరింత చేరువ చేసేందుకే ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తుందని ఈకార్యక్రమాన్ని ప్రతీ ఒక్కరూ వినియోగించు కోవాలని గణపవరం మండల ప్రత్యేక అధికారి కె.శ్రీనివాస్ అన్నారు. శనివారం గణపవరం మండలంలో ప్రారంభించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన గణపవరం-3, ముప్పర్తిపాడు సచివాలయాల పరిధిలో పాల్గొని కార్యక్రమ లక్ష్యాన్ని వివరించారు. జూలై 1నుంచి జూలై 31 వరకూ అన్ని గ్రామ సచివాలయాల పరిధిలో ఎంపీడీవో, తహసీల్దార్ల ఆధ్వర్యంలో రెండు బృందాలు ప్రజల సమస్యలు, ప్రభుత్వ పథకాలు, పథకాల పొందడంలో కలుగుతున్న అవరోధాలు తెలుసుకుని పరిష్కరిస్తారన్నారు. 11 రకాల సర్టిఫికెట్లు అక్కడికక్కడే ఉచితంగా అందజేస్తారని తెలిపారు. ప్రతి సచివాలయంలో క్యాంపు తేదీకి వారం రోజుల ముందు గ్రామ వలంటీర్లు ఆయా గృహాలను సందర్శించి వారి సమస్యలు తెలుసుకుని టోకెన్ ఇస్తారని, ఆటోకెన్‌తో క్యాంపురోజున వచ్చి అవసరమైన సర్టిఫికెట్లు పొందవచ్చునన్నారు. క్యాంపు రోజునే జగనన్నకు చెబుదాం, ఆధార్ అప్‌డేట్‌క్యాంపుకూడా నిర్వహిస్తారన్నారు. ప్రజలంతా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జ్యోతిర్మయి, తహసీల్దార్ పమ్మిలక్ష్మి, సర్పంచ్‌లు మూర అలంకారం, కర్రి రాధాలక్ష్మి శ్రీనివాస రెడ్డి, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సురక్ష పథకంపై సర్వే

దెందులూరు: జగనన్న సురక్ష పథకం ప్రతి సమస్యకు పరిష్కార వేదికను దెందులూరు మండల ప్రత్యేకాధికారి, మైనార్టీ వెల్ఫేర్ జిల్లా అధికారి కృపావరం అన్నారు. శుక్రవారం సోమవరప్పాడులో ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమం అందని వాటిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామ సచివాలయ రికార్డులో సచివాలయ సిబ్బంది నమోదు చేసుకున్నారు. నెలరోజుల పాటు అన్ని గ్రామాల్లో అన్ని సచివాలయాల పరిధిలో ఇంటింటా సురక్ష పథకం సర్వే జరుగుతుందని ప్రభుత్వ పథకాలు అమలుకాని వారంతా ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంపీడీఓ ఏబీపీవీ లక్ష్మి, తహసీల్దార్ ఎన్. నాంచారయ్య, వైస్ ఎంపీపీ వేమూరి జితేంద్ర, సర్పంచ్ సరిగే నాగరాజు, కార్యదర్శి ముంగర శ్రీకాంత్, సొసైటీ చైర్మన్ వేమూరి బసవపున్నయ్య, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

గోపీనాథపట్నంలో జగనన్న సురక్ష

ఉంగుటూరు: జగనన్న సురక్ష పేద ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందని, పథకాలు అర్హత పొందలేని వారికి మరింతగా దోహద పడుతుందని గోపీనాథపట్నం సర్పంచి, సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు పుత్సకాయల విష్ణుమూర్తి అన్నారు. శనివారం గోపినాథపట్నంలో వలంటీర్లు సచివాలయ సిబ్బంది ఇంటింటికీ తిరిగే కార్యక్రమాన్ని విష్ణుమూర్తి ప్రారంభించారు. అనంతరం కొన్ని ఇళ్లకు సిబ్బంది వెళ్లినప్పుడు సర్పంచి పర్యవేక్షించారు. పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

సాగుకు సన్నద్ధం.. సార్వా పనులు ప్రారంభం

పెదవేగి : నియోజకవర్గంలోని డెల్టా, మెట్ట ప్రాంతాల్లోని రైతులు సార్వా సాగుకు సమాయత్తమవుతున్నారు. తొలకరి వర్షాలు ప్రారంభం కావడంతో దుక్కులు దున్నుతూ సాగుకు శ్రీకారం చుడుతున్నారు. వైఎస్సార్ ప్రభుత్వంలో పాడి పంటలు పుష్కలంగా ఉంటాయని నమ్మిన రైతులు పట్టువదలని విక్రమార్కుడిలా ఎన్నో ఆశలతో సాగుకు సన్నద్ధమవుతున్నారు. నియోజకవర్గంలో 42,500 వేల ఎకరాల్లో సార్వా సాగవుతోంది. ఇందులో సగం పైగా నేరుగా విత్తనాలు వెదజల్లే పద్ధతిలో సాగు చేస్తారు.

మెడపై విత్తు కత్తి

దెందులూరు నియోజకవర్గంలో 1061, 1001, పీఎల్, 1121, బీపీటీ5204, 1064 స్వర్ణ వంటి రకాలు ఎక్కువగా సాగు చేస్తారు. గతేడాది సాగు నీరందక సార్వా సాగు సాఫీగా జరగలేదు. దీంతో రైతులు సొంతంగా విత్తన సేకరణ చేసుకోలేని పరిస్థితి ఏర్పడింది. నియోజకవర్గానికి 1,275 టన్నులకు పైగా విత్తనాలు కావాలి. వీటిలో కేవలం 50 శాతం వ్యవసాయశాఖ పంపిణీ చేసే అవకాశం ఉంది. మిగిలిన విత్తనాలు బహిరంగ మార్కెట్లో కొనుగోలు చేయాల్సి ఉంది. ఇప్పటికే ఇతర జిల్లాల నుంచి ధాన్యం దళారులు విత్తనాలు కొనుగోలు చేసి అమ్మకానికి సిద్ధంగా ఉంచారు.

సాగునీటి సరఫరాకు ఏర్పాట్లు

తొలకరిలో ఆశాజనకంగా ఉన్నప్పటికీ నాట్లు వేసే సమయానికి వీటి ప్రభావం ఏ మేరకు ఉంటుందో తెలియని పరిస్థితి. జగన్ ప్రభుత్వం వ్యవసాయానికి పెద్ద పీటవేస్తోంది. పెదపాడు, దెందులూరు, ఏలూరు రూరల్ మండలాల్లో కృష్ణా కాలువ, గోదావరి కాలువలపై ఈ ఆయకట్టు ప్రాంతంపై ఆధారపడి ఉండగా, కొంత మేర బోర్లపై ఆధారపడి ఉంది. ఇదిలా ఉంటే మెట్ట ప్రాంతమైన పెదవేగి మండలం దాదాపు బోర్లపైనే ఆధారపడి సాగు జరుగుతుంది. వర్షాలు కురిసి జలాశయాలు నిండితేనే డెల్టాకు సాగునీరందే అవకాశం ఉంది. దెందులూరు నియోజకరవ్గంలో నీరు లేక రైతులు ఇబ్బంది పడే పరిస్థితి ఇకపై ఉండదని స్థానిక ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి చెబుతున్నారు.

రైతు అండగా భరోసా

వరిసాగు ఉత్పాదక వ్యయం ఏటా గణనీయంగా పెరుగుతోంది. నారుమళ్ల నుంచి కోతలు కోసే వరకు ఎకరానికి రూ.35 వేల వ్యయమవుతోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన వైఎస్సార్ రైతు భరోసా నాలుగేళ్లుగా ఎంతగానో ఉపయోగపడుతుందని రైతులు చెబుతున్నారు.

స్వీయ క్రమశిక్షణ విద్యార్థి ఉన్నతికి దోహదం


ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం ప్రసాదరావు

ఉంగుటూరు: స్వీయ క్రమశిక్షణ విద్యార్థుల ఉన్నతికి దోహదం చేస్తుందని కైకరం ప్రధానోపాధ్యాయులు జి.ప్రసాదరావు అన్నారు. శనివారం వారంరోజులుగా పాఠశాలలో నిర్వహించిన స్వీయ క్రమశిక్షణ కార్యక్రమం ముగింపు జరిగింది. ఈ సభకు అధ్యక్షత వహించిన ప్రసాదరావు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి యోగా, ధ్యానం సాధన చేయాలన్నారు. క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని కోరారు. పాఠశాల ప్రథమ సహాయకులు సీహెచ్ శ్రీనివాసు మాట్లాడుతూ విద్యార్థులు స్వీయ క్రమశిక్షణతో విజయం సాధించవచ్చన్నారు. వారంరోజులుగా విద్యార్థులకు యోగా, ధ్యానంలో శిక్షణ ఇచ్చారు. విద్యార్థులు యోగాసనాలు వేసి ఆకట్టుకున్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థినీ విద్యార్థులకు బహుమతులు అందజేశారు. మండలస్థాయి ఆర్థిక అక్షరాస్యత క్విజ్ పోటీలో మూడో స్థానం పొందిన పి. జస్వంత్, బి ప్రసన్నలకు బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

భీమడోలు: కొల్లేరు గ్రామాల్లో జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని భీమడోలు ఎంపీడీవో సీహెచ్ పద్మావతి దేవి అన్నారు. మండలంలోని కొల్లేరు గ్రామం చెట్టున్నపాడులో హౌసింగ్ డే, ఉపాధి హామీ పనులు పరిశీలన, జగనన్న సురక్ష పథకాలపై శనివారం సమీక్షించారు. తొలుత ఉపాధి హామీ పనులను ఆమె పరిశీలించి రోజు వారీ కూలీ ఎంత వస్తుందని, ఉపాధి కార్మికుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. టెక్నికల్ అసిస్టెంట్లు మస్టర్లలో తేడాలు లేకుండా చూసుకోవాలన్నారు. జూలై 1 నుంచి మండలంలో ప్రారంభం కానున్న జగనన్న సురక్ష కార్యక్రమంపై సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు ఆమె దిశానిర్దేశం చేసారు. వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి వారి అవసరాలకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరించాలని, వాటికి టోకెన్ నంబర్ల జారీ చేయాలన్నారు. వెల్ఫేర్ అసిస్టెంట్ల, డిజిటల్ అసిస్టెంట్లు విధిగా 11 రకాల ధ్రువీకరణ పత్రాల జారీకి అవసరమైన సామగ్రిని సిద్ధం చేసుకోవాలన్నారు. అనంతరం హౌసింగ్ డే సమావేశంలో ఎంపీడీవో సీహెచ్ పద్మావతి దేవి మాట్లాడుతూ గృహ నిర్మాణలు త్వరితగతిన పూర్తి చేయాలని, ఇళ్లు నిర్మించుకునే లబ్ధిదారులకు బిల్లులను వారి ఖాతాల్లో జమ చేస్తామన్నారు. లబ్ధిదారులను చైతన్యపర్చాల్సిన బాధ్యత ఇంజనీరింగ్ అసిస్టెంట్లపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నేత జల్లూరి అభిమన్యు, హౌసింగ్ ఏఈ సీహెచ్ సతీష్, ఏపీఎం సురేష్‌కుమార్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.


చెట్టున్నపాడులో మాట్లాడుతున్న ఎంపీడీవో సీహెచ్ పద్మావతి దేవి

కొవ్వలిలో హౌసింగ్ డే


కొవ్వలి జగనన్న కాలనీలో హౌసింగ్ డేలో పాల్గొన్న ప్రత్యేకాధికారి కృపావరం

దెందులూరు: కొవ్వలి జగనన్న కాలనీలో శనివారం హౌసింగ్‌డే నిర్వహించారు. మండల ప్రత్యేకాధికారి, మైనార్టీ వెల్ఫేర్ జిల్లా అధికారి ఎస్ఎన్ కృపావరం ఆధ్వర్యంలో జగనన్న కాలనీలో రెవెన్యూ, గృహనిర్మాణం, పంచాయతీరాజ్ శాఖల అధికారులు ఇంటింటికీ వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సీఎం జగన్ పేదలకు సొంతిల్లు కల్పించాలనే లక్ష్యంతో సేవలందిస్తున్నారని అన్నారు.

ట్రాన్స్‌కో ఏఈ పోస్టుకు విముఖత

దెందులూరు: మండల ట్రాన్స్‌కో ఏఈగా రావడానికి అధికారుల నుంచి తీవ్ర విముఖత వ్యక్తమవుతోంది. దెందులూరు మండలంలో మూడు నెలల్లో ఇద్దరు ఏఈలు ఏసీబీ దాడికి గురయ్యారు. దీంతో ఏ ఒక్కరూ ఇక్కడికి రావడానికి అంగీకరించడం లేదు. ఆరు నెలల నుంచి దెందులూరు ఏఈ పోస్టు ఇన్‌చార్జితోనే నెట్టుకొస్తున్నారు. దెందులూరుకు రెగ్యులర్ ట్రాన్స్‌కో ఏఈని నియమించకపోతే అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని సిబ్బంది, ప్రజలు అన్నారు. జిల్లా అధికారులు జోక్యం చేసుకుని దెందులూరుకు రెగ్యులర్ ఏఈని నియమించాలని కోరుతున్నారు.

రేషన్ డీలర్ల రాష్ట్రస్థాయి మహాసభపై ప్రచారం

దెందులూరు: రేషన్ డీలర్ల రాష్ట్రస్థాయి మహాసభలు రాష్ట్రంలోని రేషన్‌డీలర్లు అందరూ హాజరై విజయవంతం చేయాలని రేషన్ డీలర్ల అసోసియేషన్ ఏలూరు జిల్లా అధ్యక్షుడు తలారి రామకృష్ణ కోరారు. అసోసియేషన్ రాష్ట్ర గౌరవ సలహాదారులు నర్సింహమూర్తి, కమిటీ నాయకులతో కలిసి రాష్ట్ర మహాసభ విజయవంతం అయ్యేందుకు విస్తృత ప్రచారం, అతిథులను ఆహ్వానించడం తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. వచ్చే నెల 23న విజయవాడలో మాకినేని బసవ పున్నయ్య స్టేడియంలో డీలర్ల మహాసభ జరుగుతుందన్నారు. ముఖ్య అతిథిగా పౌరసరఫరాల శాఖ రాష్ట్ర మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావును ఆహ్వానించామన్నారు. 9 అంశాలతో కూడిన సమస్యల పరిష్కారానికి రాష్ట్రంలోని డీలర్లు వారి కుటుంబ సభ్యుల భద్రత, భవిష్యత్తు లక్ష్యంగా ఈ మహాసభ నిర్వహిస్తున్నామన్నారు.

మృతుల కుటుంబాల ఆందోళన


దెందులూరు: దెందులూరు పంచాయతీ పరిధిలో విధుల నిర్వహణలో అధికారుల నిర్లక్ష్య ధోరణిపై పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రెండు నెలల్లో ఇప్పటి వరకు దెందులూరు పంచాయతీ పరిధిలో దాదాపు 20 మంది మృతి చెందారు. మృతుల కుటుంబ సభ్యులు డెత్ సర్టిఫికెట్ కోసం నిబంధనల ప్రకారం గ్రామ పంచాయతీల్లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది. పంచాయతీలోని ఉద్యోగులు కొంత మందిని దరఖాస్తు తీసుకోలేమని వెనక్కి పంపుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరికొన్ని దరఖాస్తులు తీసుకున్నప్పటికీ మరణ ధ్రువీకరణ పత్రాలు మంజూరు కావడం లేదని, దీంతో పెన్షన్లు, ఉద్యోగం, బ్యాంకు, విక్రయం, ఆస్తులు, ఇతర లావాదేవీల పనులు నిలిచిపోయాయని, కుటుంబ పెద్ద చనిపోయి కుటుంబ సభ్యులు బాధపడుతుంటే ఉద్యోగులు మరణ ధ్రువీకరణ పత్రాలు ఇవ్వకపోవడం ఎంత వరకు సమంజసమంటున్నారు. మండలాధికారులు, ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకుని మరణ ధ్రువీకరణపత్రాలను వేగంగా ఇవ్వాలని కోరారు.

సోమబ్రహ్మం మృతికి సంతాపం

దెందులూరు: పెరుగ్గూడెంకు చెందిన యలమర్తి సోమబ్రహ్మం (85) మృతి చెందడంతో అంత్యక్రియలకు ఆయన అల్లుడు మాజీ స్పీకర్ నాదెండ్ల మనోహర్, మాజీ సర్పంచ్ యలమర్తి హేమ శ్రీనివాస్, హైకోర్టు న్యాయవాది యలమర్తి విజయలక్ష్మి శనివారం హాజరై నివాళులర్పించారు. పెరుగ్గూడెంలో సోమబ్రహ్మం కుటుంబ సభ్యులను పరామర్శించారు. సోమబ్రహ్మం అనారోగ్యంతో శుక్రవారం పెరుగ్గూడెం స్వగృహంలో మృతి చెందారు.

ఆక్వా రైతులను ఆదుకోండి

గణపవరం: ప్రభుత్వం ప్రకటించిన విద్యుత్ రాయితీలను అందించి తమను ఆదుకోవాలని పలువురు రైతులు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికలో మొరపెట్టుకున్నారు. గణపవరం విద్యుత్ శాఖ ఏడీఏ కార్యాలయం వద్ద వేదిక చైర్మన్, విశ్రాంత న్యాయమూర్తి బి.సత్యనారాయణకు ఆక్వా రైతులు వినతి పత్రాలు సమర్పించారు. ప్రభుత్వం ఆక్వా రైతులకు యూనిట్ విద్యుత్ రూ.1.50 పైసలకే ఇస్తామని హామీ ఇచ్చిందని, నాలుగేళ్లుగా ప్రభుత్వం ఈపథకాన్ని అమలు చేస్తున్నా, నిబంధనల పేరుతో చాలామంది రైతులకు ప్రభుత్వ రాయితీ అందడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమాన విస్తీర్ణంలో ఆక్వా చెరువులు ఉన్న రైతులు విద్యుత్ రాయితీ వర్తిస్తున్న రైతుల కన్నా, రాయితీ లభించని రైతులు మూడు రెట్లు అధికంగా విద్యుత్ బిల్లులు చెల్లించాల్సి వస్తోందని, దీని వల్ల తీవ్రంగా నష్టపోతున్నామని పలువురు రైతులు వేదికలో చైర్మన్‌కు వివరించారు. ఆక్వా జోన్, నాన్ ఆక్వా జోన్ పేరుతో విద్యుత్ రాయితీ అమలు చేయకుండా ఆక్వా రైతులందరికీ విద్యుత్ రాయితీ వర్తింపజేయాలని కోరారు. ఒకే ఆయకట్టులో ఒక రైతు చెర్వు ఆక్వా జోన్‌లో ఉంటే ఆ పక్కనే ఉన్న మరో చెరువు నాన్ ఆక్వా జోన్‌లో ఉన్నట్లు నమోదు చేశారని, వీటిని సరిదిద్ది రైతులందరికీ న్యాయం చేయాలని పెద్ద సంఖ్యలో రైతులు వినతిపత్రాలు అందజేశారు. వేదిక మెంబర్ ఇండిపెండెంట్ సురేంద్రకుమార్, ఈఈ ఆపరేషన్స్ ఎస్.వెంకటేశ్వరరావు, ఈఈ టెక్నికల్ బి.ఝాన్సీ, డిప్యూటీ ఈఈ డి.రామకృష్ణ, ఏఈలు ప్రసాద్, మురళీకృష్ణ పాల్గొన్నారు.


గణపవరంలో సీజీఆర్‌ఎఫ్ చైర్మన్‌కు వినతిపత్రాలు అందించిన ఆక్వా రైతులు

గ్రామ కార్యదర్శిగా రంగనాయకమ్మ

దెందులూరు: దెందులూరు గ్రామ కార్యదర్శిగా డీ రంగనాయకమ్మ శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం కొవ్వలి గ్రామ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నారు. కొన్నేళ్లుగా దెందులూరు గ్రామ పంచాయతీకి కార్యదర్శి లేకపోవడం, ఇటీవల జరిగిన బదిలీల్లో కొవ్వలి కార్యదర్శిగా పనిచేస్తున్న రంగనాయకమ్మను దెందులూరు గ్రామ కార్యదర్శిగా నియమిస్తూ అధికారులు లిఖితపూర్వక ఆదేశాలు జారీ చేశారు.